ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

గురువారం 11 సెప్టెంబరు 2025

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు జగిత్యాల డీఈ గంగారాం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, సహకరించాలని కోరారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో విద్యార్థి దత్తత కార్యక్రమం 2025లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ గొల్లపల్లి గణేష్ సారథ్యంలో 30 మంది విద్యార్థులకు స్కూలు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో చంద్రకళ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు చేయూతను అందించేందుకు దాతలు ముందుకు రావడం సంతోషకరమ న్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కొడిమ్యాల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు వేసిన టీకాలు విరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యూ నైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఇమ్యూ నైజేషన్ అధికారి తనిఖీ చేశారు. చిన్నారులకు ఇచ్చే టీకాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యులు నరేష్, పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్ ఉన్నారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ
కలెక్టర్ సత్యప్రసాద్ 8

యూరియా కోసం రైతుల ఆందోళన

అతివలే కీలకం



- పరిషత్‌ల ఓటరు తుది జాబితా విడుదల
- పురుషుల కంటే మహిళలు 28,722 అధికం
- మొత్తం ఓటర్లు 6,07,263
- మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికారులు సన్నద్ధం

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో నిర్వహించనున్న పరిషత్ ఎన్నికల్లో మహిళలు కీలక పాత్ర పోషించనున్నారు. పరిషత్‌లకు సంబంధించి తుది ఓటరు జాబితాను బుధవారం ఎంపీటీసీ, జడ్పీటీసీ నియోజకవర్గాల వారీగా అధికారులు ప్రకటించారు. ఓటరు జాబితాలో పురుషుల కంటే మహిళలు 28,2722 మంది అధికంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,07,263 మంది మొత్తం ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,89,266, మహిళలు 3,17,988, ఇతరులు 9 మంది ఓటర్లున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జడ్పీ సీఈవో, ఆయా మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు ఈనెల 5న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాతో పాటు, పోలింగ్ స్టేషన్ల జాబితాలను ప్రచురించారు. వాటిపై అభ్యంతరాలను ఈనెల 8వ తేదీ వరకు లిఖిత పూర్వకంగా దరఖాస్తుకు అవకాశం కల్పించారు. వాటిని ఈనెల 9వ తేదీన పరిష్కరించి, 10వ తేదీన తుది జాబితా ప్రచురించాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో షెడ్యూల్ ప్రకారం ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఓటరు తుది జాబితాలో పురుషుల కంటే మహిళలు అధికంగా ఉండడంతో త్వరలో జరిగే మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అతివల ఓట్లు కీలకం కానున్నాయి.

మండలం	ఎంపీటీసీ	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
బీర్‌పూర్	6	8,472	9,266	0	17,738
భీమారం	6	8,307	9,270	0	17,577
బుగ్గారం	6	8,423	6,924	0	17,347
ధర్మపురి	13	17,170	18,270	1	35,389
ఎండపల్లి	8	11,790	12,286	1	24,077
గొల్లపల్లి	13	19,118	20,539	1	39,658
ఇబ్రహీంపట్నం	12	14,565	16,818	0	31,383
జగిత్యాల రూరల్	16	21,912	24,106	2	46,020
కథలాపూర్	13	17,761	19,963	0	37,724
జగిత్యాల అర్బన్	5	4,601	5,126	0	9,727
కొడిమ్యాల	12	18,568	19,854	0	38,422
కోరుట్ల	12	14,723	16,520	0	31,243
మల్లాపూర్	15	19,269	21,834	0	41,103
మల్యాల	14	19,150	21,155	2	40,307
మేడిపల్లి	9	11,320	12,931		24,251
మెట్‌పల్లి	14	17,227	19,638	1	36,866
పెగడపల్లి	13	17,351	18,518	0	35,869
సారంగాపూర్	7	9,776	10,690	0	20,466
వెల్గటూరు	8	11,209	11,474	1	22,684
రాయికల్	14	18,554	20,858	0	39,412
మొత్తం	216	2,89,266	3,17,988	9	6,07,263

14 నెలలుగా ప్రత్యేక పాలన..

గత యేడాది జనవరి 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగా ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం అనివార్య కారణాలతో వాయిదా వేసింది. జిల్లాలో 214 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారి పదవీ కాలం గత యేడాది జూలై 3వ తేదీతో ముగిసింది. జిల్లాలో 18 మంది జడ్పీటీసీ సభ్యులుండగా వారి పదవీ కాలం కూడా ఒక్క రోజు తేడాతో అంటే జూలై 4వ తేదీతో ముగిసింది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల్లో దేనికీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాలేదు. గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ షెడ్యూల్ విడుదల చేయడంతో ఆ ప్రక్రియ సైతం పూర్తి చేశారు. అయితే అది కాస్తా పక్కన బెట్టిన ప్రభుత్వం తాజాగా పరిషత్ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో ప్రస్తుతం అందరి దృష్టి మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలపై పడింది. పంచాయతీ ఎన్నికలకు

మిగతా 8వ పేజీలో

జిల్లాలో 20 ఎంపీపీ, 20 జడ్పీటీసీ స్థానాలు..

జిల్లాలో గతంలో 18 ఎంపీపీ, 18 జడ్పీటీసీ స్థానాలుండగా కొత్తగా ఏర్పడిన భీమారం, ఎండపల్లి మండలాలకు సైతం ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఖరారు అయ్యాయి. ప్రస్తుత పునర్ వ్యవస్థీకరణతో 214కు బదులుగా 216 ఎంపీటీసీ స్థానాలు ఖరారు అయ్యాయి. 20 మండలాలకు అదే స్థాయిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు కొలువుదీరనున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఆదేశాల మేరకు ప్రతీ మండలంలో కనీసం ఐదుకు తగ్గకుండా ఎంపీటీసీ స్థానాలు ఉండేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు కార్యాలయంలో ప్రధాన న్యాయమూర్తి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగిత్యాల కోర్టు ఆవరణలో ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో చిన్న కేసులతో పాటు డ్రంకెన్‌డ్రైవ్, ఈ చాలన్లు, సివిల్ తదితర కేసులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 17,300 కేసులు ఉన్నాయన్నారు. ఇందులో రాజీకి దగ్గ కేసులు 8,687 ఉన్నట్లు వివరించారు. ప్రతి కక్షిదారుడికి నోటీసులు జారీ చేశామన్నారు. రాజీ మార్గమే రాజమార్గంగా భావించి కక్షి దారులు సకాలంలో లోక్ అదాలత్ కార్యక్రమానికి హాజరై తమ కేసులను పరిష్కరించుకునేందుకు ఇది చక్కని అవకాశమన్నారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి నారాయణ, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ నిరు పేదలకు వరం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ నిరు పేదలకు వరమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. మండలంలోని వీరాపూర్ గ్రామంలో రూ.12 లక్షలతో, ఒడ్డెర కాలనీలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని గుడేటిరెడ్డి సంఘంలో రాయికల్ పట్టణం, మండలానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.12 లక్షల విలువ గల చెక్కులను, 56 మందికి కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన రూ.56 లక్షల 6 వేల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే వీరాపూర్-రామాజీపేట రహదారి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 19న గుడేటి రెడ్డి సంఘంలో క్యాన్సర్ వ్యాధి ఉచిత స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో చిరంజీవి, సీడీపీవో మమత, తహసీల్దార్ నాగార్జున, ఎంపీవో సుష్మా, ఏఈ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు దీటి రాజరెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, నాయకులు అచ్యుత రావు, కోల శ్రీనివాస్, రవీందర్ రావు, పడిగెల రవీందర్ రెడ్డి, అనుపురం శ్రీనివాస్, మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, తిరుపతి గౌడ్, ముఖీద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని చింతకుంటవాడకు చెందిన నక్క సుజాత వైద్యం నిమిత్తం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ 2.50 లక్షల రూపాయల ఎల్వోసీ మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో పాటు పట్టణంలోని అరవింద్ నగర్‌కు చెందిన శివరాత్రి రామ్ చరణ్ కుడి చేతి శస్త్ర చికిత్స నిమిత్తం 75 వేల ఎల్వోసీని ఎమ్మెల్యే అందజేశారు. ఎల్వోసి అందజేసిన ఎమ్మెల్యేకు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాలె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ విమర్శలు’

భీమారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. భీమారం మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని అన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా నడుస్తున్నాయన్నారు. మోత్కురావుపేట-చందుర్తి రోడ్డు పనులు టెండర్లు పూర్తయ్యాయని, పనులు ప్రారంభమవుతాయన్నారు. దీనిపై చిత్తశుద్ధితో ఉన్నామని, వాటి గురించి మాట్లాడే నైతిక హక్కు కోల్పోయారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, రమేష్ రెడ్డి, పుప్పాల కొమురయ్య, నీరటి మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ కుమార్, ముంజ కిషన్, చెక్కపెల్లి శంకర్, బొమ్మెన ప్రశాంత్, బూరం అరుణ్ కుమార్, చెక్కపెల్లి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయం మేరకే ఇసుక బజార్లు ఏర్పాటు

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఇసుక బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచేం దుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో ప్రభుత్వ ఖనిజాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, కలెక్టర్ సత్యప్రసాద్‌లతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతుందన్నారు. సాండ్ బజార్‌ల ద్వారా ప్రజలకు తేలికగా ఇసుక లభిస్తుందన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుకను పొందడానికి రూ.800 చెల్లిస్తే ఇంటికే వస్తుందని తెలిపారు. ఇసుక దోపిడీని, దళారీ వ్యవస్థను అరికట్టేందుకు సాండ్ బజార్‌లు దోహద పడుతాయని తెలిపారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక తరలించడానికి లారీలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇదివరకే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాండ్ బజార్‌లు ఏర్పాటు చేశామన్నారు. సొంత అవసరాలకు ఇసుక ఉపయోగించుకునే వినియోగదారులు స్థానిక తహసీల్దార్ వద్ద రూ.800 చెల్లించి ఇసుక పొందాలని తెలిపారు. రవాణా వాహనాలకు, కూలీలకు అదనపు రూపాయలు వినియోగదారులే చెల్లించాలని తెలిపారు. త్వరలో వెల్గటూర్ మండలంలో ఇసుక బజార్ ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాత్రం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఉచితంగా ఇసుక లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, ప్రాజెక్ట్ అధికారి వినయ్, మున్సిపల్ తాజా మాజీ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, గాజెంగి నందయ్య, బండ శంకర్, గాజుల రాజేందర్, గిరి నాగభూషణం, ఆర్‌టీఏ సభ్యుడు కంటాల శ్రీనివాస్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీభక్త మార్కండేయ దేవాలయంలో శ్రీగాయత్రి దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన వేడుకల కరపత్రాలను బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. భక్తి భావంతో వేడుకలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బోగ గంగాధర్, రాజ్‌కుమార్, రాజేందర్, మహేష్, ప్రభాకర్, అనీల్, బాల ముకుందం, శ్రీనివాస్ ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

రాయికల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం 8, 9, 10వ తరగతి విద్యార్థులకు కృతజ్ఞత పరిపూర్ణ జీవనమునకు మార్గం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభకనబరిచినవారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కావు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజేశం, రాజశేఖర్, పద్మ, మహేశ్వర శర్మ, తరంగిణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీవో మదన్‌మోహన్

గొల్లపల్లి, సెప్టెంరు 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీపీవో మదన్ మోహన్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం గొల్లపల్లి మండలం రంగదాముని పల్లె గ్రామంలో ఇటివల ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను డీపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ దశలను బట్టి బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే జమ అవుతాయన్నారు. ఇప్పటికే నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించి నిర్మాణం పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్య పర్చాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి రాథోడ్, కాంగ్రెస్ యువనాయకులు జెల్లా అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘పుష్కర స్నాన ఘట్టాలను పెంచాలి’



ధర్మపురిలో గోదావరి స్నానఘట్టాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని గోదావరి పుష్కర స్నానఘట్టాలను పెంచాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం ధర్మపురి గోదావరి పుష్కర స్నానఘట్టాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్థానిక గడ్డ హనుమాన్ దేవాలయం నుంచి మహాలక్ష్మి ఆలయం వరకు గల ఖాళీ స్థలాన్ని, పుష్కర స్నానఘట్టాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 2015లో జరిగిన పుష్కరాల సందర్భంగా నిర్మించిన స్నానఘట్టాలు, హాజరైన భక్తుల సంఖ్య గురించి సంబంధిత అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. డ్రింకింగ్ వాటర్ సరఫరా, డ్రెస్ చేంజింగ్ తాత్కాలిక గదులు, మరుగుదొడ్లు ఇతరత్రా అవసరాలు గురించి సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. రాబోవు 2027 పుష్కరాలకు హాజరయ్యే భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. అదనంగా పుష్కర స్నానఘట్టాలు నిర్మాణం కోసం ఖాళీ స్థలాలను ఆయన పరిశీలించారు. ఒక వేళ పుష్కర స్నానఘట్టాలు నిర్మిస్తే పొడవుగా ఉన్న హనుమాన్ దేవాలయం నుండి మహాలక్ష్మి ఆలయం వరకు గతంలో ఉన్న వాటికి కలిపి నిర్మాణం చేస్తే ఎలా ఉంటుందని ఆయన చర్చించారు. గోదావరి నది వద్ద పుష్కర స్నానఘట్టాలకు మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై ఆయన చర్చించారు. ఆయన వెంట జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, ధర్మపురి మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, పీఆర్, ఇరిగేషన్ ఈఈలు లక్ష్మణ్‌రావు, శంకర్, డీఈఈలు గోపాల్, ధర్మకుమార్, భరత్, మండల డిప్యూటీ తహసీల్దార్ సుమన్, ఏఈఈలు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ ఏర్పాట్లపై సమీక్ష



ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు జన సమీకరణ, సభ ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. బేగంపేట టూరిజం ప్లాజాలో ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జన సమీకరణ, సభ ఏర్పాట్లపై చర్చించారు. ఒక్కో జిల్లా నుంచి 15 వేల మందిని కామారెడ్డి సభకు తరలించాలని నిర్ణయించి సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారయణ, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్లు సత్తు మల్లేశం, నాగుల సత్యనారాయణగౌడ్, నేరెళ్ల శారద, కేకే మహేందర్‌రెడ్డి, ప్రణవ్‌బాబు, వెలిచాల రాజేందర్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి పాల్గొన్నారు.

గంభీరావుపేటలో వైరల్ ఫీవర్

● జ్వర బాధితులతో నిండిన ఆసుపత్రి



గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర పీడితులు

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలాన్ని వైరల్ ఫీవర్ వణికిస్తోంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి జ్వర పీడితులతో నిండిపోయింది. మూడు నాలుగు రోజుల నుంచి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. తీవ్రమైన తలనొప్పి, కాళ్లనొప్పులతో పాటు జలుబు, జ్వరంతో ఆసుపత్రికి వందల సంఖ్యలో వస్తున్నారు. ఓ వైపు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుండటం మరోవైపు సరిపడా బెడ్లు లేకపోవడం కొంత సమస్యగా మారింది. దీంతో కొందరికి రక్త పరీక్షలు నిర్వహించడం, మరికొందరికి మందులు ఇచ్చి పంపిస్తూ, రక్త పరీక్షలకు మరుసటి రోజు రావాలని సూచిస్తున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



రాజేష్‌యాదవ్(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని అక్బర్‌నగర్‌కు చెందిన రాజేష్ యాదవ్ మృతదేహం లభ్యం అయినట్లు ఎస్సై శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరో తేదీన గణపతి నిమజ్జనంలో ప్రమాదవశాత్తూ ఇందారం గోదవరి బ్రిడ్జిపై నుంచి కాలుజారి గోదావరి నదిలో పడి గల్లంతయ్యాడు. బుధవారం రాజేష్‌యాదవ్ మృతదేహం లభించింది. మృతదేహం మండలంలోని శివ్వారం గోదావరి పరివాహక ప్రాంతం నది ఒడ్డున మృతదేహం కనిపించగా స్థానిక రైతులకు తమకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో అక్కడకు వెళ్లి రాజేష్ యాదవ్ మృతదేహంగా గుర్తించామన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

వణికిస్తున్న వానరాలు.. పరుగులు పెట్టిస్తున్న శునకాలు..

● కూరగాయలు, పంట చేలు ధ్వంసం
● దాడులతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న ప్రజలు

మంథనిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథనిలో కోతులు, కుక్కలతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. కుక్కలు, కోతులు వీధులలో గుంపులు, గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతండటంతో ప్రజలు గాయాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. మంథని



ఇళ్లల్లోకి వచ్చిన కోతులు

పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. కోతుల కారణంగా ఇండ్ల పైకప్పులు, కూరగాయల మొక్కలు, పండ్ల చెట్లు దెబ్బ తింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. షాపుల్లోకి, ఇళ్లలోకి చొరబడి సామగ్రిని ఎత్తుకుపోతున్నాయి. అడ్డుకోవటానికి ప్రయత్నిస్తే దాడికి యత్నిస్తున్నాయని వాపోతున్నారు. కోతుల గుంపు వచ్చిందంటే కొన్ని గంటల పాటు నరకమేనని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మరోవైపు కుక్కలు కూడా గుంపులు, గుంపులుగా తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. కోతులు, కుక్కలు కారణంగా పాఠశాలల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పనుల కోసం బయటకు వెళ్లే మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. తమ వెంట కర్ర పట్టుకొని వెళ్లుతున్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు, క్రీడాకారులు మైదానానికి రావాలంటే జంకుతున్నారు. ఆగస్టు నెలలో మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో కోతుల



మంథని వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

దాడిలో 156, కుక్కలదాడిలో 42మంది. ఈ నెలలో 52మంది కోతులు, కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా మంథని మున్సిపాల్, అటవీశాఖ, గ్రామ పంచాయతీల అధికారులు స్పందించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పుస్తెలతాడు చోరీ

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకవ్వకు చెందిన రెండు తులాల పుస్తెల తాడును బుధవారం దొంగలు అపహరించుకొని వెళ్లినట్లు బాధితురాలు వెంకవ్వ తెలిపారు. మధ్యాహ్నం వెంకవ్వ మెడలో నుంచి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు పుస్తెల తాడును లాక్కొని వెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి కుమారుడు లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వెంకట్రావుపల్లెలో కొనసాగుతున్న 144 సెక్షన్

ముస్తాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో 144 సెక్షన్ కొనసాగుతోందని ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ప్రభుత్వ స్థల విషయంలో ఓ వర్గానికి, గ్రామస్థులకు మధ్య జరుగుతున్న వివాదంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు గ్రామంలో పోలీసులు బందో బందుబస్తు ఏర్పాటు చేశారు. ధర్నా చేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యం

● శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు
● విరాళాలు ప్రకటించిన ఎన్‌ఆర్‌ఐలు
● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యమని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం యూనివర్సిటీ సెమినర్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా పర్యటనలోని వివరాలను వెల్లడించారు. 2008లో స్థాపించిన యూనివర్సిటీ భిన్న కోర్సులు, నాలుగు పీజీ సెంటర్లతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయంగా పేరు తెచ్చుకునేందుకు ముందుకుసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఉపకులపతి శాతవాహన ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేశా మని, అమెరికా వెళ్లి అక్కడి నుంచి శిక్షణ, పరిశోధన, మెరుగైన అవకాశాల కోసం ఎన్నారైల నుంచి విరాళాలు సేకరించామన్నారు. సాంకేతిక అభివృద్ధి కోసం కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలకు సహాయం చేశారన్నారు. పీజీ విద్యార్థుల స్నాతకోత్సవానికి బంగారు పతకాలను అందజేశారన్నారు. బోస్టన్ నగరంలో మీట్ అండ్ గ్రీట్ ద్వారా తెలంగాణ ఎన్నారై సంఘం బోస్టన్ చాప్టర్ రూ.3 లక్షల విరాళం ఇచ్చినట్లు చెప్పారు. డాక్టర్ దివాకర్ జాన్డియం, కోట సుమన్ రెడ్డి రూ.2లక్షల చొప్పున బంగారు పతకాలు అందజేశారన్నారు.



వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

హూస్టన్ నగరంలో జితేందర్ రెడ్డి రూ.లక్ష, డాక్టర్ రాజశేఖర్ ఎలమంచిలి వెయ్యి డాలర్లు, అనురాధ, డాక్టర్ రమేష్ చర్విరాల రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని తెలిపారు. షార్లెట్‌లో కృష్ణ కాదరి రూ.లక్ష, దామోదర్ రెడ్డి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు. ఫిలడెల్ఫియాలో కర్ర సుభాష్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని, న్యూయార్క్‌లో సుధాకర్‌రావు విదియాల హెచ్‌పీఎల్‌సీ పరికరం, రూ.2 లక్షల బంగారు పతకం, ఏటా కెమిస్ట్రీ విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి, హైదరాబాద్ ప్లాంట్‌లో ఐదుగురు విద్యార్థులకు ఇంటర్నెట్ షిప్ సదుపాయాలు కల్పించారన్నారు. న్యూ జెర్సీలో డాక్టర్ బండారి సుధాకర్ 10 కంప్యూటర్లను, ప్రదీప్ సువర్ణ రూ.2 లక్షల బంగారు పతకం, డాక్టర్ మనోహర్ శ్రీరామోజి రూ.2లక్షల బంగారు పతకం ఐదు సంవత్సరాల వరకు అందజేస్తామన్నారని తెలిపారు. డాక్టర్ కిషోర్ భూపతి రూ.2 లక్షల, శరత్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాలు అందజేశారన్నారు. వాషింగ్టన్ డీసీలో జనేత రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకం లా విద్యార్థుల కోసం అందజేసినట్లు చెప్పారు. నవంబరు రెండో వారంలో విశ్వవిద్యాలయంలో రెండోసారి స్నాతకోత్సవాలను నిర్వహిస్తామని, ఇందులో విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎన్నారైల సహకారంతో శాతవాహన విశ్వవిద్యాలయాన్ని తెలంగాణలోనే మొదటి వరుసలో నిలపడానికి ప్రయత్నం చేస్తామని,వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

వృద్ధురాలి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన అధికారులు



అమృతమ్మను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

ఇల్లందకుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన కళ్లెం అమృతమ్మ ఫిర్యాదుపై అధికారులు బుధవారం విచారించారు. అమృతమ్మ భర్త చిన్న రాజిరెడ్డి పదేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త మృతి చెందిన తర్వాత కొడుకులిద్దరూ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నుంచి ఎలాంటి జీవనభృతి లేకపోవడం వల్ల ఎడ్ల దొడ్డిలో జీవనం సాగిస్తున్నారు. కొడుకులు తనను పట్టించుకోవడం లేదని అమృతమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు గిర్దావర్ నాగరాజు, కానిస్టేబుల్ రాజేష్, మహిళ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ జ్యోతి, సఖి కౌన్సిలర్ పద్మావతి, డీహెచ్‌హెడ్ జెండర్ స్పెషలిస్టు కవితలు బోగంపాడు గ్రామంలోని అమృతమ్మ ఉంటున్న గుడిసెను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొడుకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అధికారులు పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అందించనున్నట్లు తెలిపారు.

గర్షకుర్తి మరమగ్గాలపై విజిలెన్స్ తనిఖీలు

గంగాధర, సెప్టెంబరు 110 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం గర్షకుర్తి పవర్ లూమ్స్‌పై బుధవారం విజిలెన్స్ అధికారులు దాడీ చేశారు. జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంటు ఏడీ అనిత ఆధ్వర్యంలో చెన్నయ్‌కి చెందిన అధికారుల బృందం దాడీ చేశారు. మర మగ్గాలపై కలర్ చీరలు తయారు చేస్తున్న గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్ మగ్గాలపై దాడులు చేసి కేసు నమోదు చేసి, దూస వెంకటేశ్‌ల మరగ్గాలపై దాడులు చేసి రంగుల చీరలు తయారు చేస్తుండగా కోసివేశారు. పాత జీవో ప్రకారం కలర్ చీరలు తయారు చేయవద్దని ఆర్డర్లు ఉన్నప్పటికీ కార్మికులు వాటిని తయారు చేస్తుండగా కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గ్రామంలో మగ్గాలను పరిశీలిస్తూ కలర్ చీరల తయారీ కార్మికులను బెంబేలెత్తించారు.



మగ్గాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని మైత్రి హోటల్ వద్ద ఈ నెల 7న సాయంత్రం డబ్బుల విషయంలో నిష్టూరి యశ్వంత్, ముద్దుల మధును కారులో కిడ్నాప్ చేసి, బెదిరించి డబ్బులు తీసుకున్న కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ కేసులో నల్లపాటి నరేష్, గుడిమల్ల సివిల్, తునికిపాటి శేఖర్, ఆలకుంట ఉపేందర్, ఆలకుంట అశోక్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధమున్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ

● పోలీసులకు బాధితుల ఫిర్యాదు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ చేశారని బాధితులు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లెడ గ్రామంలో గణేష్ నవరాత్రులకు సంబంధించిన చందా ఇవ్వకపోవడంతో తమ నాలుగు కుటుంబాలను కులం నుంచి వెలివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలతో ఎవరూ మాట్లాడకూడదని షరతులు విధించారన్నారు. ఎవరైనా మాట్లాడితే రూ.25 వేల జరిమానా విధిస్తామని కుల పెద్దలు హెచ్చరించినట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

హైనా దాడిలో శునకం మృతి

మల్యాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల సివిల్ సప్లై గోదాం వద్ద వన్యప్రాణి హైనా దాడిలో శునకం మృతి చెందింది. బుధవారం గోదాంల వద్ద శునకం మృతి చెందడాన్ని గోదాం సిబ్బంది గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం అర్ధరాత్రి వన్యప్రాణి ఈ ప్రాంతంలో సంచరించినట్లు ఇక్కడ లభించిన ఆనవాళ్ల మేరకు హైనాగా అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. హైనా సంచారం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు

వీణవంక,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డిపై ఆధారాలు లేకుండా సోషల్ మీడియా వాట్సప్ గ్రూపులలో అనుచిత వాక్యలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు పోస్టులు పెట్టడంతో మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బావు రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రెండు పార్టీల మధ్య గొడవలు జరిగేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి,బండా కిషన్ రెడ్డి,ఖుర్శుల చరణ్ రావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో ఇతరులకు భంగం కలిగేలా శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వారితో సామాజిక సేవ

● ఆస్పత్రిలో పండ్లు .. విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ
● గోదావరిఖని కోర్టు ఆదేశాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో పరివర్తన తీసుకువచ్చేందుకు గోదావరిఖని కోర్టు జరిమానాలతో పాటు సామాజిక సేవ చేయాలనే ఆదేశాలనిచ్చింది. బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి అంతర్గాం, ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 8మంది మందు బాబులకు ఒక్కొక్కరికి రూ.2వేల నుంచి రూ.4వేల జరిమానా విధించడంతో పాటు సామాజిక సేవలను శిక్షలుగా విధించారు. జడ్జి ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుళ్లు రవికుమార్, బుర్ర శ్రీనివాస్ శిక్షలు అమలు చేయించారు.

ప్రభుత్వాసుపత్రి, పాఠశాల ఆవరణలను శుభ్రం చేయడం, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, విద్యా ర్థులకు నోట్ పుస్తకాల పంపిణీతో పాటు గాంధీనగర్‌లోని ఇందిరమ్మ సర్కిల్ వద్ద మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ విధులు నిర్వహించారు.



మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు

చెరువులో పడి వృద్ధురాలు మృతి

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట నమాజ్ చెరువులో మారవేణి మల్లవ్వ(68) అనే వృద్ధురాలు పడి మృతిచెందింది. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన మల్లవ్వ సమీప నమాజ్ చెరువులో అదేరోజు రాత్రి శవమై కనిపించింది. మల్లవ్వకు మానసిక పరిస్థితి బాగాలేకనే చెరువులో పడి చనిపోయిందని మృతురాలు బంధువులు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు మల్లవ్వ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా మల్లవ్వ దొరకలేదు. అదేరోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో సమీప నమాజ్ చెరువులో మల్లవ్వ శవమై కన్పించింది. మానసిక పరిస్థితి బాగాలేకనే మల్లవ్వ చెరువులో పడి ఊపిరి ఆడక చనిపోయిందని మృతురాలు కొడుకు సాయిలు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షా 15 వేల కోట్లు దోచుకున్న కేసీఆర్

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి లక్షా 50 వేల కోట్లు ఖర్చయినట్లు కేసీఆర్ చెప్పారని, వాస్తవంగా 35 వేల కోట్లు ఖర్చవగా మిగతా లక్షా 15 వేల కోట్లు కేసీఆర్ కుటుంబం దోచుకుందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కోటి 40 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయని, రక్తం దారపోసి కర్త, కర్మ, క్రియ, ఇంజనీరుగా అన్ని తానై కట్టినట్లు చెప్పారని అన్నారు. ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై జస్టిస్ గోష్ కమిషన్ చేసిన విచారణ అనంతరం నివేదికలో వాస్తవాలు బయటపడ్డాయన్నారు. జస్టిస్ గోష్ కమిషన్ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు అందజేశారన్నారు. లక్ష 15 వేల కోట్లు అవినీతి జరిగిందని, కానీ ఇందులో తనకు ఎలాంటి సంబంధమూ లేదని, ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత మొత్తం కేసీఆర్ తీసుకున్నారని నాటి ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు గోష్ కమిషన్‌కు స్పష్టం చేస్తూ లిఖితపూర్వకంగా రాసిచ్చారన్నారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అందజేశారన్నారు. కేసీఆర్ దోచుకున్న లక్ష 15 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ప్రజల కష్టార్జితమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగింది వాస్తవమని, కానీ ఆ అవినీతిని చేసింది మాత్రం నాడు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీష్‌రావు మాత్రమేనని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇసుక వ్యాపారం చేసిన సంతోష్‌రావు అందులో వేల కోట్లు దోచుకున్నారని కవిత చెప్పిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. హరితహారం పేరుతో సంతోష్‌రావు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని ఇటీవల కవిత బహిరంగంగా చెప్పారన్నారు. కేసీఆర్ కూతురు కవిత స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెబుతుంటే కేటీఆర్ సిగ్గు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్ములావన్ కేసులో అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిన కేటీఆర్ ఇప్పుడు దానిపై లొట్ట పీసు కేసు అంటూ పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నేరెళ్లలో ఇసుక మాఫియాపై ప్రశ్నించినందకు థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఏ పని చేసుకోని విధంగా కొట్టి వారి జీవితాలను నాశనం చేశారని స్వయంగా కవిత చెప్పారన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత కోట్ల రూపాయలతో భవనాలు, ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని, కేసీఆర్ 60 ఎకరాలలో ఉన్న ఫామ్ హౌస్ నేడు 600 ఎకరాలు అయ్యిందని అన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత అమెరికా, దుబాయ్, సింగపూర్‌లలో వేల కోట్లు పెట్టుబడులకు డబ్బు ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. ఆస్తుల పంపకాల్లో గొడవలతోనే కవిత ఇదంతా బయట పెట్టారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లో నిజాం వారసులకు చెందిన 30 వేల ఎకరాల భూమిని కేటీఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావు, కవిత కబ్జా చేశారని, దీని కోసమే ధరణి తీసుకొచ్చారని అన్నారు. నిజాంకాలంలో నిర్మించిన సచివాలయం పునర్నిర్మాణంలో భాగంగా జరిపిన తవ్వకాల్లో బంగారం, పచ్చ రంగు వజ్రాలు బయటపడ్డాయని, వాటిని సమానంగా పంచాలని కవిత డిమాండ్ చేయడంతో ఆ కుటుంబంలో గొడవలు వచ్చాయని అన్నారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువకులు ఉద్యమాలు చేసి ప్రాణత్యాగాలు చేస్తే, చలించిపోయిన సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కేసీఆర్ సీఎం అయ్యాక వారి ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ నలుగురి ఉద్యోగాల తరువాత తెలంగాణ రూ.8 లక్షల కోట్ల అప్పుల పాలయ్యిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, కల్వల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పురోహితుడు అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన తివారి శైలేందర్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శైలేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని ఓ గది అద్దెకు తీసుకుని స్థానిక ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్నాడని తెలిపారు. మధ్యాహ్నం ఇంటి నుంచి ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలోని నారోజు రాజు బైక్‌పై వెళుతున్న క్రమంలో శైలేందర్ భార్య శైలతో పాటు కుటుంబ సభ్యులు అడ్డుకునేందుకు యత్నించారని చెప్పారు. వారి ద్విచక్రవాహనాన్ని వెంబడించి అతని స్నేహితులతో మాట్లాడుతున్న తరుణంలో శైలేందర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆరా తీశారని తెలిపారు. ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. తన భర్త కనిపించకపోవడానికి కొండాపూర్ వాసి నారోజు రాజుపై అనుమానం ఉందని పేర్కొంటూ శైలేందర్ భార్య శైల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

వివాహిత మృతికి కారణమైన అత్త, బావలపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : వివాహిత ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని మృతురాలు అత్త ఈరవేణి లక్ష్మి, బావ సత్యనారాయణలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామంలోని వివాహిత ఈరవేణి రమ్య తన అత్త లక్ష్మి, బావ సత్యనారాయణలు మానసికంగా వేధించడంతో మనస్థాపం చెంది ఈనెల 9న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఎల్లంపల్లికి.. బీఆర్‌ఎస్‌కు ఏం సంబంధం?

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్ సెప్టెంబర్10 ,(ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే నిర్మించినట్టుగా బీఆర్‌ఎస్ నాయకులు తెగ ఊదర గొడుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. అసలు ఎల్లంపల్లి ప్రాజెక్టునకు బీఆర్‌ఎస్‌కు ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. బుధవారం సీఎల్‌పీ మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విలేకరులతో మాట్లాడుతూ ఎల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మానస పుత్రికగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టునకు శంకుస్థాపన జరిగిందని, పనులు సైతం పూర్తి చేసినట్టు ఆయన స్పష్టం చేశారు. అయితే ఎల్లంపల్లి ప్రాజెక్టును తామేనిర్మించామన్నట్లుగా బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీష్‌రావు తెగ ఊదరగొడుతున్నారని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రారంభించిన పక్షంలో కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతో ఇప్పటి వరకు అధికారికంగా ప్రారంభోత్సం చేయలేదన్నారు. ఒక వేళ ఎల్లంపల్లిని పూర్తి చేసిన పక్షంలో కేసీఆర్ ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. ఈ ప్రాజెక్టుతో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, భూపాలపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లోని 2.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలాగే సింగరేణి, సింగరేణి విద్యుత్ సంస్థలకు ఇక్కడినుంచే నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. అబ్దుల్ కలాం సుజల స్రవంతి కింద 10 టీఎంసీలు గ్రేటర్ హైదరాబాద్‌కు పైప్‌లైన్‌ల ద్వారా తాగు నీటికోసం పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

లక్ష ఉద్యోగాలకు కట్టుబడిన కాంగ్రెస్ సర్కార్

● ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్ సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామన్న మాటకు కట్టుబడి ఉందని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ శాసనసభ్యుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. టీజీపీఎస్‌సీపై హైకోర్ట్ తీర్పులో కాంగ్రెస్ పార్టీని కానీ ప్రభుత్వాన్ని ఎక్కడ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ఎలాంటి అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు బతుకులను చీకట్లో నెట్టింది మీ పార్టీ, మీ నేత కేటీఆర్ కాదా. అని ప్రశ్నించారు. అవాకులు చెవాకులు పేలితే మాటలతో కాదు... చేతలతో చూపించాల్సి వస్తుందని మక్కాన్ సింగ్ ఠాకూర్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి యువత భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. నిరుద్యోగులు బీఆర్‌ఎస్ నాయకుల రెచ్చగొట్టే మాటలు నమ్మవద్దని కోరారు. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని , ఏ విద్యార్థికి నష్టం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.

ఏడుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన ఏడుగురు యువకులను బైండోవర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌కు చెందిన పైండ్ల అజయ్, తిరుపతి, స్వామి, సాయి కేశవ్, రాజేందర్, కుమార్, శ్రీనును బుధవారం స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

● త్వరలో అద్దె భవనంలోకి మారనున్న నాలుగు కోర్టులు

● రాజన్న సిరిసిల్ల జిల్లాలో జీప్లస్ 4 అంతస్థులు.. 12 కోర్టులకు రూపకల్పన

● రూ.81.26కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

'న్యాయ నిర్మాణ్ భవన్'కు శ్రీకారం



సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): కక్షిదారుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో జిల్లా కోర్టు మోడల్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. సిరిసిల్ల పట్టణంలో 5.1ఎకరాల స్థలంలో జిల్లా కోర్టు భవన సముదాయాన్ని నిర్మించడానికి ప్లాన్ సిద్ధమైంది.ఇందులో భాగంగానే రోడ్డు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు జిప్లస్4 అంతస్తులతో 12కోర్టుల నిర్మాణానికి రూపకల్పన చేశారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 81.26కోట్లు కేటాయించింది. నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణ పనులు ఈనెలాఖరులోగా చేపట్టేందుకు ముహూర్తం ఖరారైంది.

● నేలమట్టం కానున్న పాత భవనం

పాత తాలుకా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో 1973లో మున్సిఫ్‌కోర్టును ప్రారంభించారు. 52సంవత్సరాల క్రితం పక్కా భవనంలో ఏర్పాటుచేసిన మున్సిఫ్ కోర్టు పాత భవనం నేలమట్టం కానుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాగా రూపాంతరం చెందిన తర్వాత సిరిసిల్లకు జిల్లా కోర్టు, 1వ అదనపు సెషన్స్ జిల్లా కోర్టుతో పాటు పోక్సో కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరయ్యాయి.ఈవిధంగా కోర్టుల సంఖ్య పెరగడంతో పాత భవనాలు సరిపోవడంలేదు. దీంతో ప్రభుత్వం జిల్లా కోర్టుసమీకృత భవన సముదాయం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

● అధునాతనంగా 'న్యాయ నిర్మాణ్ భవన్'

జిల్లాకేంద్రంలో అధునాతన పద్ధతిలో 'న్యాయ నిర్మాణ్ భవన్' సముదాయం నిర్మాణా నికి సిద్ధం చేశారు. జీప్లస్4 విధానంలో భవన సముదాయాన్ని నిర్మించడానికి రూపకల్పన చేశారు. భవిష్యత్తులోనూ మరో రెండు అంతస్థులు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో 12 కోర్టు హాళ్లు, ఆఫీసర్స్ చాంబర్స్, ప్రతి ఫ్లోర్‌లో బార్ అసోసియేషన్ హాలు, టాయిలెట్స్, కక్షిదారుల చాంబర్, విజిటర్స్ చాంబర్‌లను మోడల్ విధానంలో నిర్మించడానికి రూపొందించారు. ప్రతి ఫ్లోర్‌కు వెళ్లేందుకు కక్షిదారులకు ఒక లిఫ్ట్, న్యాయ వాధికారులకు ఒక లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండుఫ్లోర్‌లో పూర్తిస్థాయిలో 88 కార్లు, 62బైక్‌లు పార్కింగ్ సౌకర్యం కల్పించడానికి నిర్ణయించారు. ఇందులో ప్రస్తుతం ఉన్న జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టు, ఫ్యామిలీ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, 1వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు, 2వ అదనపు జూనియర్ సివిల్ కోర్టులతోపాటు భవిష్యత్తులో మంజూరయ్యే మరో ఆరు కోర్టులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా న్యా యనిర్మాణ్ భవనాన్ని నిర్మించడానికి టెండర్ ప్రక్రి య పూర్తయింది. ఈ టెండర్‌ను కెఎంవిఆర్ కంపెనీ దక్కించుకొని 24నెలల్లో పూర్తిచేయడానికి అగ్రిమెంట్ చేసుకొంది.

● ఈనెల 15న అద్దెభవనంలోకి కోర్టులు..

నూతన కోర్టు సమీకృత భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనుండడంతో ఈనెల 15న అద్దె భవనంలోకి మారనున్నాయి. మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జారీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సర్దార్‌నగర్‌లో గల ఓ భవనంలోకి మూడు కోర్టుల వ్యవహారాలు సాగుతాయి. ఇందులో పీడీఎం, ఏడీఎం, 2వ ఏడీఎం కోర్టులు ఉంటాయి. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో అద్దె భవనంలోకి సీనియర్ సివిల్ కోర్టు మారుతోంది. మిగతా జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టులు ప్రస్తుతం ఉన్న బార్ అసోసియేషన్ హాలులోనే కొనసాగుతాయి.



తాత్కాలికంగా ఏర్పాటుకానున్న అద్దె బిల్డింగ్

అద్దె భవనంలోకి నాలుగు కోర్టులు..

- పీ. నీరజ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అధునాతన పద్ధతులతో నూతన కోర్టు భవనం నిర్మాణానికి ముహూర్తం చేయనున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నాలుగు కోర్టులు అద్దె భవనంలోకి మార్చుతాం. సువిశాలమైన స్థలంలో నిర్మించే ఈ భవనం నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టేందుకు హైకోర్టు రూపకల్పన చేసింది.

నూతన భవన నిర్మాణానికి సిద్ధం..

- జూపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్, సిరిసిల్ల



జిల్లా కేంద్రంలో నూతన సమీకృత కోర్టు భవన నిర్మాణానికి సిద్ధం కావడం శుభపరిణామం. ఈ కోర్టు భవనం నిర్మాణానికి పలువురు హైకోర్టు న్యాయ మూర్తులను ఆహ్వానించేందుకు హైకోర్టుకు వెళ్లి వచ్చాం. ఈనెలాఖరులోగా నూతన కోర్టు భవనానికి శంకుస్థాపన కానుంది.

అరుణాచల యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. భాద్రపదశుద్ధ పౌర్ణమితో పాటు తీర్థయాత్రల టూర్‌లో భాగంగా ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 14న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ అదే రోజు అరుణాలచం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం 15వ తేదీ మధ్యాహ్నం బస్సు బయల్దేరి జోగులాంబ దర్శనం అనంతరం కరీంనగర్ చేరుకుటుందని పేర్కొ న్నారు. పెద్దలకు రూ.4700, పిల్లలకు రూ.3540 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 7382849352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 82క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు గోనె సంచుల్లో క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7450 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మానకొండూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన టప్ప వెంకటేశం(27) తన మోటార్ సైకిల్‌పై చెంజర్లకు వెళ్తున్నాడు. చెంజర్ల వద్ద మాలోతు శ్రీనివాస్ (37) మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్‌కు తరలించారు.

ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ నేత నీలం మధుముదిరాజ్



హాజరైన ముదిరాజ్ కులస్తులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలని, బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో టీఎంపీఎస్ ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న నిజామాబాద్‌లో నిర్వహించనున్న సభలో సీఎం, రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌ల బీసీ-ఏలో చేర్చడంపై ప్రకటన చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ముదిరాజ్‌లు అందరూ ఏకతాటిపై ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో జిల్లాకు 30 మంది సర్పంచులను గెలిపించుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేసిందన్నారు. సీనియర్ నాయకులు మంద నగేష్ ముదిరాజ్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరవేణి రంజిత్ ముదిరాజ్, సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కీసర సంపత్ ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పిట్టల రవీందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కుమార స్వామి ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు మామిడి తిరుపతి ముదిరాజ్, పురం రాజేష్ ముదిరాజ్, నిమ్మల కిషన్ ముదిరాజ్, ఎరవేణి రామాంజనేయులు ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బాలెన్కి మల్లేష్ ముదిరాజ్, గట్టు శ్రీధర్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధులు మౌటం సంపత్ ముదిరాజ్, పిల్లి రవి ముదిరాజ్, బోయిని వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కల్వకుంట్ల కుటుంబం

● అవగాహన లేకుండా మాట్లాడుతున్న కేటీఆర్ ● మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని రాష్ట్ర కార్మిక శాఖ, ఉపాధి శిక్షణ, కర్మాగార, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో సకల జనుల ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ చౌరస్తాలో ఆయనకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ, మహేష్ బి. గీతే, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. మంత్రి వివేక్ వెంకటస్వామికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరిక మేర కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో జౌళిశాఖ నుంచి కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్వకుంట్ల కుటుంబం కోసమే పనిచేసిందని ఆరోపించారు. సిరిసిల్లలో ఒకప్పుడు ఇసుక మాఫియా ఉండేదని, ఆ మాఫియాతోనే దళితులు చనిపోయారని, మరికొందరిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ ప్రాజెక్టుపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీరు అందించాలని గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం రూ 30 వేల కోట్లతో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టిందన్నారు. ఆ ప్రాజెక్టు కోసం రూ 11 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్ కోసం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఆరోపించారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి చేస్తున్నాడన్నారు. ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక ధార్మిక క్షేత్రమైన సిరిసిల్ల జిల్లాకు కార్మిక మంత్రిగా వివేక్‌వెంకటస్వామి మొదటిసారిగా వచ్చారని, జౌళిశాఖపై అవగాహన ఉన్న వివేక్‌వెంకటస్వామి సిరిసిల్ల కార్మికులకు అండదండలు అందించాలని కోరారు. నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆవశ్యకతను నాడు ఏఐసీసీని మెప్పించి ఒప్పించిన వారిలో మొదటివాడు కాకానే అని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, సబేరా బేగం, విజయతిరుపతి, రాణి, రాములు నాయక్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పట్టణ ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామిని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, కత్తెర దేవదాస్, రొడ్డ రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురిలో ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో బుధవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, స్థానిక వేదపండితులు మధు రామశర్మ, కాకెరి గోపాల్ శర్మ, జనుమంచి రాములు శర్మ ధర్మ కర్తలు గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

వేములవాడలో భవనంపై పిడుగుపాటు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో బుధవారం ఓ ఇంటిపై పిడుగు పడింది. పట్టణంలోని భగవంతరావునగర్‌లోని ఓ భవనంపై పిడుగు పడటంతో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమయ్యాయి. చిన్నపాటి వర్షం ఉరుములు, మెరుపులతో రావడంతో ఇంటి పైభాగంలోని గోడపై పిడుగుపడి కొంత భాగం కూలిపోయింది. ఇంట్లోని రిఫ్రిజిరేటర్, ఫ్యాన్‌లు ధ్వంసమయ్యాయి. ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి అపాయం జరుగలేదు.

● కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో..

కథలాపూర్ : కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు చిలువేరి గంగనర్సయ్య అనే వ్యక్తి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఇంటి పనుల్లో నిమగ్నమైన గంగనర్సయ్య కుటుంబం పిడుగుపాటుకు ఒక్కసారిగా భయాందోళనలకు గురైంది. పిడుగుపాటుతో ఇంటి పైభాగం పెచ్చులూడి పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

● 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీరు వదలడం బుధవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 376.827 టీఎంసీ నీరు రాగా, 309.083 టీఎంసీల నీరు వదిలారు.

శ్రీపాద ఎల్లంపల్లిలో..

పెద్దపల్లి : జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం వరకు 75,266క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎస్సారెస్పీ నుంచి 12,500 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 5,252క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 57,514 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. 10గేట్ల ద్వారా 75,266 క్యూసెక్కుల వరదనీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 20.175టీఎంసీలకు గాను, 20.175 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.12టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్ 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


మిడ్ మానేరులోకి..

బోయినపల్లి : శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు బుధవారం 13,400 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. దిగివ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.76 ఉండగా, నీటి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.940 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.


దివ్యాంగులకు అండగా ఉంటాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

తిమ్మాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో ఉన్న మానసిక దివ్యాంగుల పాఠశాలలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసిందని తెలిపారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికాలంగుల పాఠశాలలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 మంది దివ్యాంగులకు ఉపకరణాలు, ఇతర సంక్షేమ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. త్వరలో వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. మానసిక వికలాంగులకు సేవ చేస్తున్న సిబ్బందికి కలెక్టర్ల ద్వారా ఓ ఏజెన్సీ ఏర్పాటు చేసి వారికి అవుట్ సోర్సింగ్ ద్వారా జీతాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. పాఠశాల ఇబ్బందులపై మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని, దీనికి స్పందించిన సీఎం వెంటనే 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసి ట్రస్టు అకౌంట్‌లో జమచేయించారని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజ మాట్లాడుతూ. దివ్యాంగుల సంక్షేమానికి బాల భరోసా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారన్నారు. మాజీ ఎమ్మెల్యే, ట్రస్టు చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి మానసిక వికలాంగుల పాఠశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ రాకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేక చాలా ఇబ్బందికరంగా పాఠశాలను నడిపిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను తెలపడంతో వెంటనే స్పందించి 50 లక్షల గ్రాంటును విడుదల చేశారని తెలిపారు. వొకేషనల్ కోర్సుల కోసం మరో 40లక్షల నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అనంతరం దివ్యాంగుల పిల్లలతో కలిసి మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కొమ్మురెల్లారెడ్డి, భగవాన్, వెంకటయ్య, ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



దివ్యాంగుల నృత్యాలను తిలకిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు

రచయిత డాక్టర్ కిరణ్‌కు 'వడ్డేపల్లి' జాతీయ సాహిత్య పురస్కారం

సిరిసిల్ల సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన రచయిత, కవిగా డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌కు అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అందించే డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ చైతన్య స్ఫూర్తి వంటి సంకలనం, ఓ తండ్రి తీర్పు లఘు చిత్రకథ, కవితలు, వ్యాసాలు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. సుప్రసిద్ధ సినీ గేయరచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ స్మారకార్థం సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరగబోయే ప్రత్యేక కార్యక్రమంలో కిరణ్‌కు అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.



కిరణ్

బాధిత కుటుంబానికి చేయూత

రాయికల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాజీ వాడకు చెందిన మోటాకాడి రాజారాం కూతురి భర్త నటరాజ్ 15 రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శివాజీ రైతు యువజన, సంఘమిత్ర సభ్యులు బాధిత కుటుంబానికి రూ.66,500 జమ చేసి నటరాజ్-జ్యోత్స్నల కూతురు సుహాసిని పేరు మీద రాయికల్ సొసైటీ బ్యాంక్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందించారు. ఇందులో శివాజీ రైతు యువజన, సంఘమిత్ర సంఘాల అధ్యక్షుడు కురుమ సుదర్శన్ రెడ్డి, జిల్లాల సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, సభ్యులు పాతూరి సురేష్ రెడ్డి, పాలడుగు అనిల్‌రెడ్డి, కొయ్యడి మనోజ్‌రెడ్డి, బేతి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

రాయికల్: కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్ కనుక ప్రభాకర్‌ను రాయికల్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాయికల్ మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గాజెంగి అశోక్, ఉపాధ్యక్షుడు బోగ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పారిపెల్లి నారాయణ, సహాయ కార్యదర్శి కడకుంట్ల మనోహర్, కోశాధికారి ఎనుగందుల గణేష్, ప్రచార కార్యదర్శి శ్రీపతి లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి తుమ్మ రాజేశం పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ ఆర్థిక సాయం

కథలాపూర్: మండలంలోని పోతారంకు చెందిన మామిడిపల్లి నరేశ్ అనే వ్యక్తి ఇటీవల తీవ్ర అనారోగ్య కారణాల వల్ల మృతి చెందగా ఆయన కుటుంబానికి చింతకుంటకు చెందిన బైరదేవ్ అనే ఎన్ఆర్ఐ బుధవారం 50 కిలోల బియ్యం, రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అన్నారపు నర్సయ్య, శంకర్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

కథలాపూర్: మండలంలోని 19 గ్రామాలకు మొదటి విడతలో 334 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 310 ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని హౌసింగ్ ఏఈ శ్రీయ తెలిపారు. మండలంలోని దుంపెట, దూలూరు గ్రామాల్లో పనులను పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే 140 ఇండ్లు బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. 110 ఇళ్లకు మొదటి విడత రు. లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పనులు చేస్తున్నామన్నారు.

చెక్కుల పంపిణీ

మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో మెట్‌పల్లి పట్టణ, మండలాలకు చెందిన లబ్ధిదారులుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పాల్గొన్నారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

-కలెక్టర్ సత్యప్రసాద్ -జిల్లాలో ఘనంగా ఐలమ్మ వర్ధంతి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చాకలి ఐలమ్మ పోరాట యోధురాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, బీసీ వెల్ఫేర్ అధికారిణి సునీత, డీఆర్‌డీవో రఘువరణ్, ఏవో హకీమ్ ఉన్నారు.

●పట్టణంలోని చింతకుంట మినీ ట్యాంకు బాండ్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు రమేష్ బాబు, దుర్గయ్య, జీవన్, జగన్, గాజుల రాజేందర్, అల్లాల రమేష్ రావు, రవి, రాజేందర్, శంకర్, పెద్దులు, శేఖర్, గిరిధర్ ఉన్నారు.

●బీఆర్ఎస్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, మోరపల్లి గ్రామాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో జగిత్యాల ప్యాక్స్ సంఘ అధ్యక్షుడు పత్తిరెడ్డి మైపాల్‌రెడ్డి, లింగన్న, ప్రశాంత్, మహేష్, శ్రీకాంత్, భూమరాజం, రాజారాం, బొల్లారపు భూమేష్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

●కోరుట్ల: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి గొప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, రజక సంఘ సభ్యులు అన్నారు. బుధవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను సిపిఐ నాయకులు అర్పించారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘ సభ్యులతో కలిసి సిపిఐ నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు, వామపక్ష నేతలు చింత భూమేశ్వర్, ఎండి ముక్రం, రాదా, పోశయ్య, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు రజక సంఘం నాయకులతో కలిసి ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.




ఐలమ్మకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, మెట్‌పల్లి మండలంలో పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

●మెట్‌పల్లి రూరల్: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని రజక సంఘం, యువసేన ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే సంజయ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. చింతామణి చెరువు వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం పట్టణ శాఖ అధ్యక్షులు కొనపర్తి రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొనపర్తి సత్యనారాయణ, మండల అధ్యక్షులు నారాయణ, కోశాధికారి గుండయ్య, కేదారి పాల్గొన్నారు.

●రాయికల్: పట్టణంలోని రజక కులస్థుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు.

●కథలాపూర్: చాకలి ఐలమ్మ వర్ధంతిని మండల కేంద్రంలో రజక సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షులు చిలుముల మహేశ్, గంగరాజం, శేఖర్ ఉన్నారు.

●సారంగాపూర్: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షులు మర్రిపెల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి గొల్లపెల్లి రవి, గౌరవ అధ్యక్షులు కొదురుపాక లింగన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాంచందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాల్లో రజక సంఘం నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్, మల్లేశం, నర్సయ్య, సాగర్, మర్రిపెల్లి శంకర్, కాసారువు తిరుపతి, రాకేష్, సభ్యులు, హిమ్మతురావుపేటలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు పాల్గొన్నారు.

●గొల్లపల్లి: చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను అట్టహాసంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు కాంపెల్లి హన్మండ్లు, ముస్కు నిశాంత్ రెడ్డి, ఆవుల సత్తయ్య, మారం రాజశేఖర్, నాయకులు కచ్చు కొమురయ్య, కట్ల మహేష్, కోమల్ల జలేందర్, గంగాధర నరేష్, రజక సంఘం అధ్యక్షులు కలికోట సత్య తదితరులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: మల్లాపూర్, రేగుంట, వివిరావుపేట తదితర గ్రామాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతిని పలువురు నాయకులు, రజకులు నిర్వహించారు. ఆమె విగ్రహానికి ఘన నివాళులర్పించారు.



జగిత్యాలలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న డీఈవో రాము

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రాము అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక డీసీఈబీ భవన్‌లో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా మండలి ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో హాజరై మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది మహిళల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరిత చర్య అని అన్నారు. అనంతరం ప్రజ్వల సంస్థ మేనేజర్ చంద్రయ్య బీఎన్ఎస్ చట్టం, ఐటీపీఏ, పోక్సో, పీసీఎంఏ, జెజె యాక్ట్, సఖి, భరోసా, చైల్డ్‌లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100, 181, 1930 ల గురించి వివరించారు. ఉపాధ్యాయులు గ్రూప్‌లుగా ఏర్పడి ప్రివెన్షన్, ప్రొటెక్షన్, ప్రాసిక్యూషన్ అంశాలపై రోల్‌ప్లే, స్కిట్‌గా చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ సుజాత, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు రాజేష్, మహేష్, ఏపీవో ఆనందరెడ్డి, స్నేహలతతో పాటు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ టీచర్లు పాల్గొన్నారు.

మాటు కాలువ మరమ్మతు

కథలాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాగులో పడి వృథాగా పోతున్న సూరమ్మ చెరువు నీటిని మండలంలోని తాండ్ర్యాల రైతులు తమ చెరువులోకి మళ్లించేందుకు మాటు కాలువకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. గతంలో వాగుకు అడ్డంగా నిర్మించుకున్నప్పటికీ కొంతమేర ధ్వంసమైంది. దీంతో నీరు లీకేజీ అవుతూ వృథాగా పోతోంది. ఈ నేపథ్యంలో వాగుకు రాళ్ళు, మట్టి అడ్డంగా వేసుకొని నీటిని చెరువులోకి మళ్లించుకున్నారు. సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నీటిని కిందికి వదులుతుండడంతో నీరంతా వాగులో పడి వృథాగా పోతోంది. రైతులు కష్టపడి మాటు కాలువను మరమ్మతులు చేసుకున్నారు. చెరువు నిండితే భూగర్భ జలాలు పెరిగి తాగు, సాగు నీటి ఇబ్బందులు తీరనున్నాయని రైతుల పేర్కొన్నారు.

అతివలే కీలకం

(ఐదో పేజీ తరువాయి)

మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని అంటున్నారు.

●రిజర్వేషన్లపై ఉత్కంఠ..

స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. జడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు సర్పంచ్‌లుగా పోటీ చేయాలనుకునే ఆశావహులు ఆయా స్థానాల్లో రిజర్వేషన్ తమకు అనుకూలంగా వస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. పరిషత్ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఆశలు రేకెత్తినట్లయింది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఉండే అవకాశాలు ఉండటంతో ఆయా పాత స్థానాలకు కొత్త రిజర్వేషన్లు రానున్నాయి. రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకపోవడంతో ఆయా గ్రామాల్లోని కీలక నాయకులు, మండలాల్లో పట్టున్న నేతలు తమ అనుచరులను కాపాడుకోవడం కష్టంగా మారింది. ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ వస్తుందో ఇప్పుడే తెలియపోవడంతో అన్ని సామాజిక వర్గాలకు చెందిన అనుచరులను తమ వెంట తిప్పుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

●ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం..

బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ జారీ చేసిన అనంతరం పరిషత్, పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పడంతో జిల్లా యంత్రాంగం గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేసింది. దాంతో పాటు పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులు లేకుండా నిర్వహించనున్నందున ఇప్పటికే బ్యాలెట్ పేపర్లను ముద్రించి గోడౌన్లలో భద్రపరిచారు. పోలింగ్ కోసం పలు ప్రాంతాల నుంచి తెప్పించిన బ్యాలెట్ బాక్సులకు మరమ్మతు చేయించి సిద్ధం చేసి పెట్టారు. ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన వెంటనే సిబ్బందికి శిక్షణ ఇస్తే సరిపోతుంది.

●అధికారులకు శిక్షణ పూర్తి..

ప్రభుత్వం పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారన్న సంకేతాలు రావడంతో జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీటీసీల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి పెట్టారు. ఎన్నికలు పార్టీ గుర్తుల ఆధారంగా నిర్వహించనున్నందున బ్యాలెట్ పేపర్లు తెచ్చి ఇప్పటికే గో డౌన్లలో భద్రపరిచారు. పీవో, ఏపీవోలకు శిక్షణ కూడా ఇచ్చారు. షెడ్యూల్ వస్తే మాత్రం ఓపీవోలకు కూడా డివిజన్ల వారీగా శిక్షణ ఇవ్వడంతో పాటు నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత బ్యాలెట్ పేపర్లను ముద్రించనున్నారు.

ఓటరు జాబితా సిద్ధం

-గౌతమ్‌రెడ్డి, జడ్పీ సీఈవో



జిల్లాలో పెరిగిన మండలాలకు అనుగుణంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటరు లిస్టును సిద్ధం చేశాం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు తుది జాబితాను విడుదల చేశాం. జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఎండపల్లి, భీమారం మండలాల్లో సైతం మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటరు లిస్టును సిద్ధం చేశాం.

యూరియా కోసం రైతుల ఆందోళన



రైతు వేదికలో యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

పెగడపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం రైతులు ఆందోళన చేశారు. పెగడపల్లిలోని సహకార సంఘం గోదాంకు మంగళవారం సాయంత్రం 800 యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పెగడపల్లి రైతు వేదికలో యూరియా సరఫరాకు కూపన్లు జారీ చేశారు.

దీంతో 200 మంది రైతులకు యూరియా అందకపోవడంతో ఆందోళన నిర్వహించారు. రైతులకు మండల బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఎస్ఐ కిరణ్ కుమార్, వ్యవసాయాధికారి శ్రీకాంత్ రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పెగడపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం లింగాపూర్ శివారులో కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో బుధవారం మరొకటి బిగించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శీర్షికన కథనం రావడంతో అధికారులు స్పందించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపుతో తమ విద్యుత్ సమస్య తీరిందని సమస్య పరిష్కారానికి కృషిచేసిన ఆంధ్రజ్యోతికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల కార్యవర్గం



ఎన్నికైన విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గ సభ్యులు

కొడి మ్యాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం కొడిమ్యాల మండల అధ్యక్షుడిగా అప్పారావుపేట గ్రామానికి చెందిన గుడిపెల్లి భూమారెడ్డిని, కార్యవర్గాన్ని సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికల అధికారి బాల మురళికృష్ణ తెలిపారు. కార్యదర్శిగా బండ వెంకటరెడ్డి, అసోసియేట్ ప్రెజిడెంట్‌గా వడ్లకొండ బుచ్చిరాములు, ఉపాధ్యక్షులుగా 1. సీహెచ్. వెంకటరెడ్డి, 2. ఉపేంద్రాదేవి, కోశాధికారిగా పాతూరి రవీందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి. నారాయణ, జాయింట్ సెక్రటరీగా ఆహ్మద్ అలీ, ప్రచార కార్యదర్శిగా డి. నర్సయ్య, జిల్లా కౌన్సిలర్‌గా పైడిపెల్లి సత్యనారాయణరావులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు ఎల్ల గంగరాజం, ప్రధాన కార్యదర్శి కరబూజ రవీందర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ

-డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. చీరలను నిలువ చేసేందుకు జిల్లాలో ఐదు స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యాక్, మెప్మా సమావేశ మందిరంతో పాటు కోరుట్ల స్త్రీ శక్తి భవనం, మెప్మా సమావేశ మందిరంను సెర్ప్ ఏపీడీ సునీతతో పాటు పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట మెప్మా ఏవో శ్రీనివాస్, జిల్లా సెర్ప్ డీపీయంలు రమేష్, నారాయణ, నాగేశ్వర్‌రావు, ఏపీయంలు గంగాధర్, దేవరాజ్, సమత, టీయంసీలు రజిత, రాము ఉన్నారు.

ఉపాధిహామీ పనులను పూర్తి చేయాలి

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ రఘువరన్ సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాలలో జరుగుతున్న పనుల వివరాలను పీడీ రఘువరన్ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ రాజశేఖర్, ఉపాధి ఏపీఓ మమతలతో పాటు గ్రామ కార్యదర్శులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా రాజు



ధర్మపురి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా నునావత్ రాజు ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు బుధవారం కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గడ్డం చందన, ప్రధాన కార్యదర్శిగా ఫకీర్‌రాజు, కోశాధికారిగా రామకిష్టు జలందర్‌ను ఎన్నుకున్నారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తాం

మెట్‌పల్లి రూరల్: రాష్ట్రంలోని పేద ప్రజల అందరికీ పక్క ఇళ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని కోనరావుపేట గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామ పంచాయతీ కోసం స్థలాన్ని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణాలో సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇళ్లు లేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడానికే ఇందిరమ్మ పథకం ప్రవేశపెట్టి నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేశారన్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం అక్కడక్కడా ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకుందని, పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్య క్షుడు, మెట్‌పల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు మారు గంగారెడ్డి, జక్కని పరంధాం, మారు సాయిరెడ్డి, భూమేష్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్వాడను విజయవంతం చేయాలి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న సేవా పక్వాడ కార్యచరణను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు అన్నారు. పట్టణంలోని స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సేవా పక్వాడ్ కార్యక్రమంపై కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17 ప్రధాని మోదీ జన్మదినం నుంచి అక్టోబరు 2 వరకు ప్రతి రోజూ నిర్వహించాల్సిన రోజువారి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సేవా పక్వాడ్, బీజేపీ జిల్లా బాధ్యులు సత్యనారాయణ, నలువాల తిరుపతి, వడ్డేపల్లి శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, కన్నం అంజయ్య, దొనికెల నవీన్‌కుమార్, సదాశివ్, కొమ్ము రాంబాబు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



కోరుట్లలో ఓటరు లిస్టు ప్రదర్శిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల ఓటర్, పోలింగ్ స్టేషన్‌ల జాబితాను బుధవారం ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్‌తో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తూది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను నోటీస్ బోర్డ్‌పై ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి ప్రచురించారు. కార్యక్రమంలో సూపర్‌డెంట్ నరిసింహారెడ్డి,కార్యదర్శులు రవళిక, కీర్తిదివ్య, సిబ్బంది పూర్ణచందర్, స్వామి పాల్గొన్నారు.

●బీర్‌పూర్: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓటరు జాబితాను ఎంపీడీవో భీమేష్ విడుదల చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అశోక్ ఉన్నారు.

●కొడిమ్యాల: మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీవో ఇ. స్వరూప నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఈఈ చంద్రశేఖర్, ఎంపీవో వెంకటేశ్వర్లు, కార్యాలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు.


●మల్యాల: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబందించి తుది ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో స్వాతి ప్రదర్శించారు.

●పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రదర్శించారు.

●రాయికల్: ఓటర్ల తుది జాబితాను ఎంపీడీవో చిరంజీవి ప్రచురణ చేశారు.

●ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మొహమ్మద్ సలీమ్ ప్రదర్శించారు.

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది



కబడ్డీలో గెలుపొందిన మొగిలిపేట విద్యార్థులతో ఉపాధ్యాయులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మండల అభివృద్ధి అధికారి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌ను ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వాలన చేసి, ఒలింపిక్ పతకావిష్కరణ చేశారు. క్రీడల్లో 600 మంది విద్యార్థులు పాల్గొన్న క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్, ప్రతిజ్ఞ చేసినంతరం విద్యార్థులతో పాటు ఎంఈవో చంద్రశేఖర్‌తో కలిసి కబడ్డీ ఆడి ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి నారాయణ, నాయకులు మారు మురళీధర్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల ఎస్‌జీఎఫ్ బాలుర క్రీడా ఎంపిక పోటీలు బుధవారం పొలాస ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా ఎంపీఓ రవిబాబు హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, కార్యదర్శి రాఘవేంద్ర, పీడీలు పాల్గొన్నారు.

●మల్లాపూర్: చిట్టాపూర్‌లో మండల స్థాయి క్రీడత్సోవాల ముగింపు వేడుకల్లో మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతుల ప్రదానం జరిపారు. మొగిలిపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన సీనియర్, జూనియర్ బాలికల కబడ్డీ పోటీలో ప్రథమ, జూనియర్, సీనియర్ బాలురు కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతులు పొందారని వివరించారు.

●ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 14, అండర్ 17 విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో సలీం, ఎంఈఓ మధు పాల్గొన్నారు.

●రాయికల్: భూపతిపూర్ గ్రామంలో ఎస్‌జీఎఫ్ క్రీడలు రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా బుధవారం ఖోఖో, కబడ్డీ క్రీడలు ప్రారంభమమైనట్లు మండల విద్యాధికారి రామవులు తెలిపారు.

మాజీ సర్పంచ్‌కి ఘన నివాళి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకుడు, న్యాయ వాది మారంపల్లి శ్రీనివాస్ తిరుమలలో ఈ నెల 9న మృతి చెందగా ఆయన మృత దేహం బుధవారం స్వగ్రామానికి తీసుకు వచ్చారు. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, బీజేపీ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, నాయకులు మారంపల్లి శ్రీనివాస్, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు చైర్మన్ కూన గోవర్ధన్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జిల్లా స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు ఎంపిక

వెల్గటూర్: మండలం లోని కుమ్మరిపల్లి కేజీబీవీ బాలికలు గురువారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలలో కుమ్మరిపల్లి కేజీబీవీ బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ఎడ్ల లక్ష్మి తెలిపారు. అథ్లెటిక్స్ జూనియర్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో విసీల, సీనియర్స్ విభాగంలో హరిణి, 200 మీటర్ల పరుగు పందెంలో జూనియర్స్ విభాగంలో అనన్య, సీనియర్స్‌లో హరిణి, 400 మీటర్ల పరుగు పందెంలో జూనియర్స్‌లో పూజ, సీనియర్స్‌లో శ్రావ్య, 800 మీటర్ల పరుగు పందెంలో జూనియర్స్‌లో అరవింద, సీనియర్స్‌లో నిషిత, వైష్ణవిలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా పాఠశాల సిబ్బంది వారిని అభినందించారు.

సింగిల్‌విండోలకు యూరియా సరఫరా

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి, మల్యాల సింగిల్‌విండోల పరిధిలోని రైతులకు బుధవారం యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ తెలిపారు. తక్కళ్లపల్లి సింగిల్‌విండోకు 340, మల్యాల సింగిల్‌విండోకు 340 సంచులు రాగ వాటిని రైతులకు ఇబ్బందులు కలగకుండా పంపిణీ చేయడం జరిగిందని రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దన్నారు. విండో చైర్మన్ చంద్రశేఖర్, సీఈవో మనోజ్, ఏఈవో మంజుల, డైరెక్టర్లు పాల్గొన్నారు.